యువత నైపుణ్యాలు పెంచుకోవాలి

● ప్రభుత్వ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ కళ్యాణి



మాట్లాడుతున్న ప్రభుత్వ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ కళ్యాణి

ఒంగోలు: నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలను యువత పెంపొందించుకోవాలని ఒంగోలులోని డీఏస్ ప్రభుత్వ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి పిలుపునిచ్చారు. స్థానిక కాలేజీలో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. దేశంలో యువత దాదాపు 50 శాతం ఉందన్నారు. యువత పెడదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. వివిధ శాఖల ద్వారా యువతకు వివిధ రకాల వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి శిక్షణ ఇచ్చి వారిలో దాగి ఉన్న నైపుణ్యాలకు సాంకేతిక పరిజ్ఞానం జోడించి జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నట్లు వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ కె.శ్యామ్ సునీల్ మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ కలిగిన డ్రస్ మేకింగ్, బ్యూటీ కల్చర్, మగ్గం వర్క్, బేసిక్ కంప్యూటర్ అప్లికేషన్స్, జూట్ బ్యాగుల తయారీ, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, వెదురుతో అలంకరణ వస్తువుల తయారీ వంటి శిక్షణ కార్యక్రమాలను తమ సంస్థ నిర్వహిస్తోందన్నారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి వైపు బాటలు వేయాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ చైర్మన్ డాక్టర్ పి.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

మహిళల పోరుయాత్రను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

ఒంగోలు: హింసపై మహిళల పోరుయాత్రను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. హింసపై మహిళలు నిర్వహిస్తున్న యాత్రకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలోని ఐద్వా కార్యాలయం వద్ద శనివారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మహిళలపై రోజు రోజుకు హింస పెరుగుతోందన్నారు. మనువాద భావజాలాన్ని పాలకులు అనుసరిస్తున్నందుకే ఈ దురాగతాలు పెచ్చరిల్లుతున్నాయన్నారు. మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడితే అతనిపై చర్యలు తీసుకోకుండా కేంద్రం ప్రేక్షక పాత్ర పోషిస్తోందన్నారు. మహిళల హింసకు సంబంధించి 41 రోజుల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్షలు విధించాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలను నిషేధించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపుల నిరోధక అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని, డీ అడిక్షన్ సెంటర్లను విస్తృతం చేయాలని కోరారు. హింస, అశ్లీలత, అసమానతలు ప్రేరేపించే సినిమాలు, టీవీ సీరియళ్లు, ఇంటర్‌నెట్ కార్యక్రమాలను నిషేధించాలన్నారు. దేశం, రాష్ట్రంలో నేరాల నియంత్రణకు న్యాయ నిపుణులు, రిటైర్డ్ న్యాయమూర్తులు, ఇతర అధికారులతో కలిసి స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మీ, జిల్లా నాయకులు జి.ఆదిలక్ష్మి, ఎస్.మాలతి, బి.రాజ్యలక్ష్మి, బి.గోవిందమ్మ, కె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

● షాదీతోఫా సమస్య పరిష్కారంపై నూర్ బాషా యూత్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షం

ఒంగోలు: నూర్‌బాషాలు ఎదుర్కొంటున్న షాదీతోఫా సమస్యను పరిష్కరిస్తూ జీవో విడుదల చేయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ నూర్‌బాషా యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను బాషా షేక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూర్‌బాషాలకు షాదీతోఫా కాకుండా కల్యాణమస్తు కింద రూ.50 వేలు మాత్రమే వస్తున్నట్లు సీఎంకు ఇటీవల వివరించామన్నారు. దానికి సీఎం స్పందించి సత్వరమే షాదీతోఫా అమలయ్యేలా శనివారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు

ఒంగోలు అర్బన్: డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి అల్లడి జ్ఞానశ్రీ తెలిపారు. నగరంలోని భాగ్యనగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలబాలికల వసతి గృహాల్లో దోమల నివారణకు శనివారం స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

● వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు


కొత్తపట్నంలోని పంట పొలంలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న జేడీ శ్రీనివాసరావు

కొత్తపట్నం: ప్రతి పంటకు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరని వ్యవసాయశాఖ జేడీ ఎస్.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ–క్రాప్ నమోదుపై శనివారం వివిధ రకాల పంటలను ఆయన పరిశీలించారు. కొత్తపట్నంలో వేరుశనగ, చామదుంప, వివిధ రకాల కూరగాయల పంటల ఈ–క్రాప్ నమోదును పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈ–క్రాప్‌లో పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల బీమా పొందాలన్నా, సున్నా వడ్డీ వర్తించాలన్నా, పండిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకోవాలన్నా, పంట నష్టపరిహారం అందాలన్నా ఈ–క్రాప్‌లో పంటలు నమోదు చేయించుకోవాలని వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 360 ఎకరాల్లో పంటలకు ఈ–క్రాప్ నమోదు పూర్తి చేశారని, మిగతా పొలాలకు చేస్తున్నారని తెలిపారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు

● రూ.6.78 లక్షల విలువైన ఎరువులు, పురుగు మందుల సీజ్


ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజుపాలెం (కొత్తపట్నం): ఎరువులు, పురుగు మందుల షాపులపై విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు చేశారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఉన్న భారతి, వల్లూరమ్మ, వెంకట హరీష్ షాపుల్లో తనిఖీలు చేసి రూ.6,78,165 విలువ చేసే ఎరువులు, పురుగు మందులను సీజ్ చేశారు. వాటి అమ్మకాలను నిలిపివేయాలని ఆయా షాపుల యజమానులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు బీవీవీ సుబ్బారావు, సీఐ ఎస్.రాఘవరావు, ఎస్సై జి.నాగేశ్వరరావు, విజిలెన్స్ వ్యవసాయ అధికారి సంగమేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పశుపోషకులు అవగాహన పెంచుకోవాలి


పశుపోషకులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రతిమ

ఒంగోలు రూరల్: పశుపోషణపై పోషకులు అవగాహన పెంచుకోవాలని ఉలిచి పశువైద్యురాలు డాక్టర్ ప్రతిమ సూచించారు. మండలంలోని వలేటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలో పశుపోషకులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండాకాలం పోయి వర్షాకాలం వచ్చిన నేపథ్యంలో పశువులు వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సకాలంలో పశువైద్యుల సహకారం తీసుకుంటే పశుమరణాలు పూర్తిగా తగ్గిపోతాయన్నారు. పలు విషయాలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ జుబీద్, సచివాలయ సిబ్బంది హేమలత, గ్రామ పశుపోషకులు పాల్గొన్నారు.

వెనుకబడిన జిల్లాగా ప్రకటించాలి

● జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించాలి
● ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు


మాట్లాడుతున్న శాసనమండలి సభ్యుడు లక్ష్మణరావు

ఒంగోలు: ప్రభుత్వాలు ప్రకాశం జిల్లాని వెనుకబడిన జిల్లాగా గుర్తించి రూ.10 వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అనేక రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పెంట్యాల హనుమంతరావు, పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె మాబు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగులు ఆత్మీయ సభకు హాజరుకావాలి


ఆత్మీయ సభకు ఆహ్వానిస్తున్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ

మద్దిపాడు: మండలంలోని మాదిగ ఉద్యోగులంతా ఆదివారం ఒంగోలులో నిర్వహించే ఆత్మీయ సభకు హాజరుకావాలని ఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం మండలంలో పలువురిని కలిసి ఆహ్వానించారు. సభకు మందకృష్ణమాదిగ హాజరవుతున్నారని, తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

నారాయణస్వామి కుటుంబానికి న్యాయం చేయాలి

ఒంగోలు: పాదిలిలో విధి నిర్వహణలో విద్యుత్ షాక్ కొట్టి చనిపోయిన ఎనర్జీ అసిస్టెంట్ నారాయణస్వామి కుటుంబానికి విద్యుత్ యాజమాన్యం న్యాయం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఒంగోలు రీజియన్ కమిటీ అధ్యక్షుడు జీవీ రాగయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రమాదానికి కారకులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

● డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి


పీహెచ్‌సీ సబ్‌సెంటర్లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు రూరల్: అన్ని వృత్తుల్లోకెల్లా అత్యంత పవిత్రమైనది, గౌరవింపదగినది వైద్య వృత్తి అని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని వలేటివారిపాలెం గ్రామ సచివాలయ సమీపంలో ఉన్న పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా ఆమె సందర్శించారు. తొలుత మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణితో కలిసి గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. మురుగు కాలువల నిర్వహణపై సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని మంచినీటి చెరువు, ఓవర్ ట్యాంక్ వద్ద గల ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందజేస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను సందర్శించి చిన్నారుల ఎదుగుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. కరవది పీహెచ్‌సీ నూతన భవనంలో పూర్తిస్థాయిలో మార్పులు చేసి త్వరలో మెడికల్ ఆఫీసర్ ద్వారా కాన్పులు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బేస్‌లైన్ పరీక్ష పరిశీలన

నాగులుప్పలపాడు: 3 నుంచి 5వ తరగతిలోపు విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించడానికి ప్రభుత్వం నిర్వహించే టెర్ల్ పరీక్షలు శుక్రవారం నుంచి మండల వ్యాప్తంగా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శనివారం రెండోరోజు నిర్వహించిన ఏపీ టెర్ల్ బేస్‌లైన్ గణిత పరీక్షను మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలోని సత్రం బడి ప్రాథమిక పాఠశాలలో జిల్లా ఏఎంవో రమేష్‌బాబు, టెర్ల్ జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ కిషోర్‌బాబు పరిశీలించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హేమలత, సీఆర్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో పేర్నమిట్ట విద్యార్థినులకు సీట్లు


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

చీమకుర్తి: పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థినులు తిరగబత్తిన స్వాతి, బండి నవ్య ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు హెచ్‌ఎం పార్వతిశాంతి తెలిపారు. స్వాతి నూజివీడులో, నవ్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీట్లు సాధించారని చెప్పారు. శనివారం పాఠశాలలో టీచర్లతో కలిసి వారిని అభినందించారు.